# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అధోగతే..



నాగులమల్యాలలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి గంగుల

- ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే నేతలను నమ్మొద్దు
- భూకబ్జాలు, దోపిడీదారులకు ఓట్లడిగే అర్హత లేదు
- ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఎప్పుడైనా గ్రామానికి వచ్చాడా?
- మంత్రి, బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి గంగుల కమలాకర్
- నాగులమల్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభం

కొత్తపల్లి, నవంబర్ 3: ఎన్నికలప్పుడు మాత్రమే గ్రామాలకు వచ్చే కాంగ్రెస్, బీజేపీని నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రతి క్షణం ప్రజల మధ్య ఉండి అభివృద్ధి చేసే బీఆర్ఎస్ నాయకులను ఆశీర్వదించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పూజలు చేసి, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం కొండాపూర్, ఖాజీపూర్, ఐలవోనిపల్లెలో ప్రచారం చేయగా, ప్రజలు డప్పు చప్పుళ్లతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన ప్రసంగించారు. సమైక్యపాలనలో నాగులమల్యాల రావాలంటే రోడ్లు లేని దుస్థితి ఉండేదని, సాగు నీరు లేక రైతులు భూములమ్ముకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక పల్లెలకు మంచిరోజులు వచ్చాయన్నారు. ఎడారిగా మారిన చెరువులకు స్వయం పాలనలో పూర్వ వైభవం తీసుకువచ్చానని, ప్రతి గ్రామంలో నిండిన చెరువులతో పంటలు పుష్కలంగా పండుతున్నాయన్నారు. ప్రతి గ్రామాన్ని పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశామని, కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో



నాగులమల్యాలలో భారీగా వచ్చిన అభిమానులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి గంగుల

గెలిపించాలని కోరారు. తాను కౌన్సిలర్‌గా పనిచేసినా, మంత్రిగా పనిచేసినా.. ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటున్నానని, ఆపదలో ఆదుకునే నాయకుడికే పట్టం కట్టాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే వస్తారని, వారిని నమ్మితే మన బిడ్డల జీవితాలు అంధకారంలోకి వెళ్తాయన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన బండి సంజయ్ ఆ తర్వాత ఎంపీగా గెలిచినా ఎప్పుడైనా గ్రామాలకు వచ్చి ఒక్క పైసా అభివృద్ధి చేశారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయని నాయకులకు ఓట్లడిగే అర్హత లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఇప్పటి వరకు ఖరారు చేయలేదని, ఎవరెక్కువ డబ్బులిస్తే ఆ వ్యక్తికి సీటు ఇచ్చే ఆ పార్టీకి ఓట్లు ఎలా వేస్తామని ప్రశ్నించారు. భూ కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడే నాయకులకు ఓట్లడిగే అర్హత లేదన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే దొంగ పార్టీల అభ్యర్థులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని దొంగలు, దోపిడీదారుల చేతుల్లో పెట్టవద్దన్నారు. మళ్లీ తప్పు చేసి తెలంగాణను గుడ్డిదీపం చేసుకోవద్దని, భవిష్యత్తు తరాల నోటిలో మన్ను కొట్టవద్దని కోరారు. ప్రజల మద్దతు చూస్తుంటే తాను నాలుగోసారి భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్న ధీమా ఉందన్నారు. ఈ సందర్భంగా నాగులమల్యాలలోని నాగుల చెరువు, లింగన్న కుంటను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు, తనకు మరోసారి ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్లు సేవ చేస్తానన్నారు. ఈ ప్రచారంలో ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్, జడ్పీటీసీ పిట్టల కరుణారవీందర్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, మాజీ శాసనసభ్యుడు కోడూరి సత్యనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు నాయిని ప్రసాద్, ఇల్లందుల రాజమ్మ, ఎంపీటీసీలు కొమ్ము హేమలత, మండల కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, ఉల్లందుల అనిల్, సట్టు శ్రీను, పంజాల రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

# జిల్లాలో అన్ని స్థానాలు బీఆర్ఎస్‌వే

- తెలంగాణ మరింత బాగుపడాలంటే మళ్లీ కేసీఆరే సీఎం కావాలి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారమే
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

మానకొండూర్, నవంబర్ 3: తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చాలా స్పష్టంగా ఉన్నారని, తెలంగాణ మరింత బాగుపడాలంటే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని వారు కోరుకుంటున్నారని రాష్ట్రప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర భారత దేశంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. సమైక్య పాలనలో తెలంగాణలో కేవలం ఒకేఒక్క ప్రాజెక్టు ఎస్సారెస్పీ మాత్రమే కట్టారని, తెలంగాణలో వందల కిలోమీటర్ల మేర గోదావరి పారుతున్నా నాటి పాలకులు ప్రాజెక్టులు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో గోదావరిపై అనేక ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. దీంతో తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. ఇప్పుడు చెరువులు, కుంటలు ఎండకాలంలో సైతం మత్తళ్లు దుంకుతున్నాయంటే ప్రాజెక్టుల ఫలితమేనని పేర్కొన్నారు. ఫేక్ సర్వేలతో విపక్ష పార్టీలు తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని ప్రజలు అనుకుంటున్నారని, తెలంగాణ ఆగం కావద్దంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికే పట్టం కట్టాలని అన్ని వర్గాల వారు విశ్వసిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మే స్థితిలేరన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ రాష్ట్రం అంధకారం కావడం ఖాయమని, కరెంట్ కష్టాలు తప్పవని తేల్చిచెప్పారు. రైతులు టార్చ్‌లైట్లు పట్టుకుని పొలాలకు వెళ్లే పరిస్థితి వస్తుందన్నారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు ఊహల్లో తేలుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని తేల్చిచెప్పారు. ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటారని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు గడ్డం నాగరాజు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రామంచ గోపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరవై ఏండ్లు ఈటల చేసిందేమీ లేదు



ఇల్లందకుంటలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- గ్రామాల్లో అభివృద్ధి శూన్యం
- పొరపాటున ప్రతిపక్షాలకు ఓటేస్తే ఆగమే
- ఒక్కసారి ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- ఇల్లందకుంట ఆలయాన్ని మరో యాదాద్రిగా మారుస్తా
- హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట, నవంబర్ 3: ఇరవై ఏండ్లు ఎమ్మెల్యేగా, ఎనిమిదేళ్లు మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అవి ప్రతి ఇంటికీ వర్తించాయని గుర్తు చేశారు. శుక్రవారం మండలంలోని కనగర్తి, లక్ష్మాజీపల్లి, మల్యాల, ఇల్లందకుంట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ వెల్లువెత్తింది. డప్పుచప్పుళ్లు, మంగళహారతులు, కోలాటాలతో మహిళలు, అయా గ్రామాల ప్రజలు పాడి కౌశిక్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట పెట్టుబడికి కోసం రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం రూ.19వేల కోట్లను రుణమాఫీ చేసినట్లు చెప్పారు. రుణమాఫీ కాని రైతులకు త్వరలో డబ్బును వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సాగు కోసం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మిషన్‌భగీరథ కింద ప్రతి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్, రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటుతో పాటు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇల్లందకుంట ఆలయాన్ని మరో యాదాద్రిగా మారుస్తా అని హామీ ఇచ్చారు. ఈటల గత ఉప ఎన్నికలో కడుపులో తల పెట్టి మోసపూరిత మాటలు చెప్పాడని, గెలిచిన తర్వాత కన్నెత్తి చూడలేదన్నారు. గ్రామాల్లో ఇసుమంత అభివృద్ధి కూడా జరగలేదన్నారు. పొరపాటున ప్రతిపక్షాలకు ఓట్లు వేస్తే బతుకులు ఆగమవుతాయని సూచించారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయగణపతి, ఎంపీపీ పావని వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఉప్పుల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్లు ఉడుత వీరస్వామి, కందాల కొమురెల్లి, సర్పంచులు మట్ట రజితావాసుదేవారెడ్డి, మొగిళి, ఎంపీటీసీలు విజయకుమార్, రమ, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రజింత్, మాజీ ఎంపీటీసీ రాంస్వరణ్‌రెడ్డి, జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ రామస్వామి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్, రత్నాకర్, జీవన్‌రెడ్డి, రవీందర్, రాజబాబు, శ్రీనివాస్, ప్రశాంత్, రమేశ్, దేవేందర్, రాజీర్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాయపల్లిలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# రైతురాజ్యం కావాలా.. రాబందుల రాజ్యం కావాలా?

- ప్రజలరా మీరే ఆలోచించాలి
- బీఆర్ఎస్ సర్కారుతోనే అభివృద్ధి
- కారు గుర్తుపై ఓటు వేయాలి
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, నవంబర్ 3: 'తెలంగాణలో రైతు రాజ్యం కావాలా..? రాబందుల రాజ్యం కావాలా..? పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులు మళ్లీ టార్చిలైట్లు పట్టుకుని పొలాల కాడికి వెళ్లే దుస్థితి వస్తుంది. బీజేపీకి ఓటు వేస్తే కుల, మత రాజకీయాలు తప్ప అభివృద్ధి ఉండదు. ఏది కావాలో ప్రజలే ఆలోచించుకోవాలి' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమ పార్టీ అని, కాంగ్రెస్ స్కాముల పార్టీ అని, బీజేపీ మత రాజకీయాల పార్టీ అని స్పష్టం చేశారు. నవంబర్ 30న కారు గుర్తుకు ఓటు వేసి రైతు రాజ్యానికి జై కొట్టాలని పిలుపునిచ్చారు. గంగాధర మండలంలోని ఇస్లాంపూర్, కొండాయపల్లి, వెంకటాయపల్లి గ్రామాల్లో శుక్రవారం రవిశంకర్ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయాచోట్ల సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రవిశంకర్ గ్రామాల్లో ర్యాలీ తీసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కర్ణాటక దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ ఐదు గ్యారెంటీలను అమలు చేయలేక ఆ పార్టీ చేతులెత్తేసిందని, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో వస్తున్న ఆ పార్టీని నమ్మవద్దని కోరారు. ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను నమ్మవద్దని, నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అభివృద్ధి చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆయాచోట్ల ప్రచారంలో ఎంపీపీ శ్రీరాం మధుకర్, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సర్పంచులు వడ్లూరి అనిత ఆదిమల్లు, శ్రీమల్ల మేఘరాజు, ఆముదాల వెంకటమ్మ, మడ్లపెల్లి గంగాధర్, జోగు లక్ష్మీరాజ పొట్టల కనకయ్య, ఎండీ నజీర్, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఆముదాల రమణారెడ్డి, నాయకులు వేముల శ్రీధర్, గంకిడి సాగర్, బండపెల్లి ఆనందం, మల్యాల బాబు, కిషన్‌గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.